సంపుటి :02 సంచిక :211 పేజీలు :06

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

గురువారం 16, అక్టోబర్ 2025

## 170 మంది మావోయిస్టులు లొంగుబాటు

- లొంగిపోయే మావోయిస్టులను స్వాగతిస్తున్నాం..
- జనజీవన స్రవంతిలోకి రాకపోతే పర్యావసనాలు ఎదుర్కొంటారు..
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా
- వచ్చే ఏడాది మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలిస్తామని పునరుద్ఘాటన



### మావోయిస్టు పార్టీ అగ్రనేత ఆశన్న లొంగుబాటు



వివరాలు 5లో..



## చిలికి చిలికి గాలివాన!

### కాంగ్రెస్ పార్టీలో పెనుతుఫానుగా మంత్రి సురేఖ ఓఎస్డీ టెర్మినేట్ అంశం

- 'బీసీలను తొక్కేస్తుండ్రు' అంటున్న మంత్రి సురేఖ కుమార్తె సుష్మిత
- రెడ్లందరూ కలిసి తమపై కుట్రలు పన్నుతున్నారని ఆరోపణ
- సీఎం సన్నిహితుడు రోహిన్‌రెడ్డిపై నిలదీత
- క్యాబినెట్ సమావేశానికి సురేఖ గైర్హాజరు
- కుమార్తెతో కలిసి డిప్యూటీ సీఎం భట్టితో భేటీ
- ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌తో మీనాక్షితోనూ చర్చలు
- మీడియా ముందు వెళ్లొద్దని మీనాక్షి సూచన

2లో..

హుజూర్‌నగర్ ప్రాంతంలోని డెక్కన్ సిమెంట్ కంపెనీ యాజమాన్యాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఓఎస్డీ సుమంత్ బెదిరించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను ఓఎస్డీ బాధ్యతల నుంచి ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖ ఇంటి వద్దకు సుమంత్ కోసం పోలీసులు రావడం.. మంత్రి కొండా సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను అరెస్టు చేసేందుకు యత్నించడంపై సురేఖ కుమార్తె సుష్మిత తీవ్రమైన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ తమపై బురదజల్లేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దలే ఇవన్నీ చేయిస్తున్నారని ఆరోపించారు. తన తల్లిదండ్రులనే లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీలోని రెడ్డి సామాజికవర్గానికి చెందిన పెద్దలంతా కుట్రలు పన్నుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. — అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

## పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు వెళ్లొచ్చు!

- హైకోర్టులోనే బీసీ కోటా అంశాన్ని తేల్చుకోవాలి
- అక్కడే తదుపరి విచారణ కొనసాగుతుంది..
- లోకల్ ఎన్నికలపై సుప్రీం కోర్టు స్పష్టీకరణ
- ఇక బీసీ కోటా విషయం హైకోర్టులోనే తేలాల్సిఉంది.



2లో..



3లో

## ఇసుక రవాణాలో పర్యవేక్షణ లోపం రావొద్దు

సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర

## పేకాట 'కేటు'గాళ్లు

- ఆదాయం కోసం కొత్త పుంతలు
- మహదేవపూర్,కాటారం మండలాల్లో ఆగని హోమ్లీ పేకాట
- పేకాట ఆడిస్తూ డబ్బులు సంపాదిస్తున్న వైనం
- సకల సౌకర్యాలతో ఆడిస్తున్న కేటు గాళ్ళు
- కానరాని నిఘా యంత్రాంగం



4లో

జీవితాలని ఛిద్రం చేస్తూ,బతుకులని చీకటి చేసే పేకాట ప్రస్తుతం రూపు మార్చుకుంది.'శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయలన్నట్లుగా ' ఈ మార్పు పేకాట రాయుళ్లకు అవకాశంగా మారింది.ఇంకేముంది పచ్చని జీవితాలని చేజేతుల నాశనం చేసుకుంటూ దుర్భరమైన జీవితాలను గడిపే దుస్థితి తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్, కాటారం మండలాల్లో పేకాట జూదం కొత్త రూటు మార్చుకుందనే ప్రచారం జోరుగా జరుగుతుంది.గతంలో ఈ ప్రాంతంలో పేకాట ఆడాలంటే దట్టమైన అటవీ,గ్రామ శివారు ప్రాంతాలను మాత్రమే ఎంచుకునే పేకాట రాయుళ్లు ఇప్పుడు సాంప్రదాయ ఇండ్లకి మకాం మార్చి జేబులు గుల్ల చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది.అయితే అవి పేరుకు మాత్రం పచ్చని కుటుంబాలు జీవించే సాంప్రదాయ ఇండ్లలా దర్శనమిస్తున్నా లోలోపల మాత్రం క్లబ్బులను తలపించేలా జోరుగా పేకాట నడుస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.దీని కోసం కొందరు వ్యక్తులు 'కేటు'గాళ్ళ అవతారమెత్తి ఎంచక్కా పేకాట ఆడిస్తున్న తీరు మాత్రం అమోఘమనే చెప్పుకోవచ్చు.ఆ ఇంట్లోనే పేకాట రాయుళ్లకు మందు,విందు లాంటి సకల సౌకర్యాలు కల్పించి కేటు తీసుకుంటారనేది బహిరంగ రహస్యమేనట. —అక్షర దర్బార్, కాటారం

## సుదీర్ఘంగా క్యాబినెట్ సమావేశం

- సుప్రీం కోర్టులో ఎల్ఈపీ కొట్టివేతపై చర్చ
- ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై మంతనాలు
- మెట్రో-2, ఎస్ఎల్బీసీ పనుల పునః ప్రారంభంపైనా..



2లో..

# పోషణ మాసంపై అవగాహన

అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి మండల సమాఖ్య భవనంలో ఘనంగా నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో డాక్టర్ ఆచార్య, ఏపిఎం సుధాకర్, మండల ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ నేతృత్వంలో అవగాహన కార్యక్రమాలు, పోషకాహార ప్రదర్శనలు నిర్వహించబడ్డాయి. డాక్టర్ ఆచార్య ప్రతి కుటుంబం పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలని, పిల్లలు మరియు గర్భిణీలు సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. ఏపిఎం సుధాకర్ అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు సమావేశాల్లో పాల్గొని పోషకాహార ప్రాముఖ్యతను వివరించాలని, మరియు అవసరమైన సలహాలు అందించాలని పేర్కొన్నారు. మండల ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ జంక్ ఫుడ్ వల్ల కలిగే సమస్యలను నివారించాలనీ, ఊబకాయం మరియు పోషణ లోపం ఉన్న పిల్లలకు ప్రత్యేక ఆహారం అందించాల్సిన బాధ్యతపై పెద్దల జాగ్రత్త అవసరమని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వివోఏలు, సేర్ప్ ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పోషకాహార ప్రతిజ్ఞ, స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ, జెండర్ సమానత్వ ప్రతిజ్ఞ కూడా నిర్వహించబడింది.

# సుదీర్ఘంగా క్యాబినెట్ సమావేశం

- సుప్రీం కోర్టులో ఎల్ఈపీ కొట్టివేతపై చర్చ
- ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై మంతనాలు
- మెట్రో-2, ఎస్ఎల్బీసీ పనుల పునః ప్రారంభంపైనా..

అక్షరదర్బార్, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం కేబినెట్ సమావేశం ప్రారంభమైంది. ఈ భేటీలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు. సమావేశంలో సుప్రీం కోర్టులో స్థానిక సంస్థల ఎన్నిక నిర్వహణపై దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేతపై ప్రధానంగా చర్చ సాగినట్లు తెలిసింది. అలాగే వానాకాలం ధాన్యం సేకరణ, మెట్రో రైలు ఫేజ్–1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, సెకండ్ ఫేజ్ ప్రాజెక్టు పనులపై మంత్రులు చర్చించినట్లు సమాచారం. మెట్రో రైలు ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతల నుంచి ఎల్ అండ్ టీ తప్పుకున్న నేపథ్యంలో సర్కార్ ఏం నిర్ణయం తీసుకుంటుందోనని చర్చ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నది. మరోవైపు ఎస్ఎల్బీసీ పనులు తిరిగి ప్రారంభించడంపై చర్చించి.. పనులు మొదలు పెట్టేందుకు కాబినెట్ ఆమోదం తెలుపుతుందని బోగట్టా. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ పనులు, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం, సమ్మక్క–సారలమ్మ ప్రాజెక్టు ఆనకట్ట, దేవాదుల ఆరో ప్యాకేజీ విషయాలు చర్చకు రానున్నాయి. మూసీ ప్రాజెక్టు, గిగ్ వర్కర్ల సంక్షేమ చట్టం, టీ–ఫైబర్ విస్తరణ, ఫ్యూచర్ సిటీ అంశాలు కేబినెట్ భేటీలో చర్చించినట్లు సమాచారం.



# చిలికి చిలికి గాలివాన!



- డిప్యూటీ సీఎంతో సురేఖ, సుష్మిత భేటీ

- కాంగ్రెస్ పార్టీలో పెనుతుఫాను మంత్రి సురేఖ ఓఎస్డీ టెర్మినేట్ అంశం
- 'బీసీలను తొక్కేస్తుండ్రు' అంటున్న మంత్రి సురేఖ కుమార్తె సుష్మిత
- రెడ్లందరూ కలిసి తమపై కుట్రలు పన్నుతున్నారని ఆరోపణ
- సీఎం సన్నిహితుడు రోహిన్‌రెడ్డిపై నిలదీత
- క్యాబినెట్ సమావేశానికి సురేఖ గైర్హాజరు
- కుమార్తెతో కలిసి డిప్యూటీ సీఎం భట్టితో భేటీ
- ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌తో మీనాక్షితోనూ చర్చలు
- మీడియా ముందు వెళ్లొద్దని మీనాక్షి సూచన

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: హుజూర్‌నగర్ ప్రాంతంలోని డెక్కన్ సిమెంట్ కంపెనీ యాజమాన్యాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఓఎస్డీ సుమంత్ బెదిరించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను ఓఎస్డీ బాధ్యతల నుంచి ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖ ఇంటి వద్దకు సుమంత్ కోసం పోలీసులు రావడం.. మంత్రి కొండా సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను అరెస్టు చేసేందుకు యత్నించడంపై సురేఖ కుమార్తె సుష్మిత తీవ్రమైన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ తమపై బురదజల్లేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దలే ఇవన్నీ చేయిస్తున్నారని ఆరోపించారు. తన తల్లిదండ్రులనే లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీలోని రెడ్డి సామాజికవర్గానికి చెందిన పెద్దలంతా కుట్రలు పన్నుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. మమ్మల్ని వదిలేయండి అని రేవంత్ రెడ్డి కాళ్లు పట్టుకొని మొక్కాలా..? 'బీసీ మంత్రి అయిన మా అమ్మను తొక్కేయాలని చూస్తున్నరు. రాష్ట్రంలో రెడ్ల డామినేషన్ నడుస్తున్నది. సీఎం రేవంత్ రెడ్డి మా అమ్మను ఇష్టమొచ్చినట్లు తిట్టేవాడు. ఢిల్లీలో ఖర్గేతో మీటింగ్‌లో మా అమ్మను రేవంత్ రెడ్డి తిడితే ఆరోజు మా అమ్మ ఎంతో ఏడ్చింది. సీఎం రేవంత్ రెడ్డి తమ్ముళ్లు కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తెలంగాణలో మొత్తం భూములు కబ్జా చేస్తున్నారు. మంచిరేవులలో విల్లాలు కట్టుకున్న కొందరు వ్యక్తులు దారి కోసం ఎండోమెంట్ భూమిని అడిగారు.. అది ఇస్తే పక్కన ప్రైవేట్ ల్యాండ్ ఇస్తామని అన్నారు. ఈ ఫైల్ మీద కొండా సురేఖ సంతకం చేస్తే, జపాన్‌లో ఉన్న రేవంత్ రెడ్డి ఆ ఫైలును ఆపించాడు. ఎందుకంటే రేవంత్ రెడ్డి తమ్ముళ్లు ఆ భూములను కబ్జా చేయాలని చూస్తు న్నారు.. అందుకే మా అమ్మ సంతకం పెట్టిన ఫైల్‌ను రేవంత్ రెడ్డి ఆపేశాడు అని సుష్మిత ఆరోపించారు.

## - రోహిన్ రెడ్డిని అరెస్టు చేయరా?

మంత్రి కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని గన్‌తో బెదిరించాడని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు చేశారని అంటున్నారు. ఆ సమయంలో పార్టీ నేత రోహిన్‌రెడ్డి పక్కన ఉన్నారని అంటున్నారు. మరి రోహిన్‌రెడ్డి ఎవరు? సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు కదా. మరి రోహిన్‌రెడ్డిని ఎందుకు అరెస్ట్ చేయరు? అంటూ సుష్మిత నిలదీశారు. 'సుమంత్ అరెస్టు గురించి నేను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కాల్ చేశాను. ఆ అరెస్టుకు తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన సమాధానమిచ్చారు. మరి ఎవరు పనిగట్టుకుని కొండా కుటుంబంపై కక్ష సాధిస్తున్నారో ప్రజలు అర్థం చేసుకోవచ్చు.

## - మీడియా ముందుకు వెళ్లొద్దు : మీనాక్షి హెచ్చరిక

మీడియా ముందుకు వెళ్లవద్దని మంత్రి కొండా సురేఖకు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి హెచ్చరించినట్లు తెలిసింది. కూర్చొని మాట్లాడదామని మీనాక్షి సూచించినట్లు సమాచారం. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో భేటీ తర్వాత సురేఖ, ఆమె కుమార్తె సుష్మిత వెంటనే మీనాక్షి నటరాజన్‌తో భేటీ అయినట్లు తెలిసింది. సుమంత్ అరెస్ట్ అంశంపై మీనాక్షి సలహాలు, సూచనలు ఇచ్చినట్లు సమాచారం.

## సుమంత్ విషయం నాకేం తెలియదు..

### మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ విషయం నాకేమీ తెలియదు. మా కుమార్తె సుస్మిత హైదరాబాద్‌లో ఏం మాట్లాడిందో తెలియదు. స్మార్ట్ ఫోన్ చూడటం నాకు రాదు. నా కుమార్తె, అల్లుడు లండన్‌లో ఉంటున్నారు.. అక్కడ వ్యాపారం చేస్తున్నారు. నా బిడ్డకు పదవి ఏమీ లేదు.. ఆమె ఏ పార్టీలోనూ లేదు. మంత్రి ఛాంబర్‌కు ఇప్పటివరకు నేను వెళ్లలేదు. భద్రతా కారణాల వల్ల వేర్వేరు కార్లలో నేను, సురేఖ వెళ్లాం. సీఎం రేవంత్‌రెడ్డి నాకు ఎమ్మెల్సీ ఇస్తామన్నారు.. ఇస్తారు. ఆయన సీఎం కావాలని కోరుకున్న వారిలో నేనూ ఒకడిని. సీఎం, మంత్రి పొంగులేటి మా ఇంటికి వచ్చారు.. నన్నెందుకు టార్గెట్ చేస్తారు ?

## - డిప్యూటీ సీఎంతో సురేఖ, సుష్మిత భేటీ

ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మంత్రి కొండా సురేఖ, ఆమె కూతురు సుష్మిత గురువారం భేటీ అయ్యారు. బుధవారం రాత్రి జరిగిన పరిణామాలన్నింటిని భట్టికి వివరించారు. సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సమావేశానికి కొండా సురేఖ గైర్హాజరయ్యారు. దీంతో మంత్రి వర్గంలో నెలకొన్న కోల్డ్‌వార్ మరోసారి విభేదాలు బయటపడినట్లయింది. క్యాబినెట్ సమావేశంలో కొండా సురేఖకు కొందరు మంత్రులు హామీ ఇచ్చారని సమాచారం. మరి క్యాబినెట్ సమావేశంలో ఆ విషయం చర్చకు వచ్చిందా.. లేదా అనే అంశం ఇపుడు చర్చనీయాంశమైంది.

## - పలువురు మంత్రుల సంఘీభావం..

హైదరాబాద్‌లోని మంత్రి కొండా సురేఖ ఇంటి వద్ద హైడ్రామా తర్వాత మంత్రి కొండా సురేఖతో ఇప్పటివరకు సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పలువురు మంత్రులు సురేఖకు సంఘీభావం తెలిపినట్లు సమాచారం. ఈ లిస్ట్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మినహా మిగిలిన వారంతా ఉన్నారని వార్తలు వినిపిస్తున్నాయి.



# పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు వెళ్లొచ్చు!

- హైకోర్టులోనే బీసీ కోటా అంశాన్ని తేల్చుకోవాలి
- అక్కడే తదుపరి విచారణ కొనసాగుతుంది..
- లోకల్ ఎన్నికలపై సుప్రీం కోర్టు స్పష్టీకరణ
- ఇక బీసీ కోటా విషయం హైకోర్టులోనే తేలాల్సిఉంది.

అక్షరదర్బార్, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ సర్కార్ విడుదల చేసిన జీవో నంబర్ 9పై హైకోర్టు విధించిన మధ్యంతర స్టే ఎత్తివేయాలని సుప్రీం కోర్టులో రాష్ట్రప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ)ను గురువారం అత్యున్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. ఇప్పటికే ఈఅంశంపై తెలంగాణ హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున పిటిషన్‌ను విచారణకు స్వీకరించలేమని స్పష్టం చేసింది. పాత రిజర్వేషన్లపై ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది. హైకోర్టులో తదుపరి విచారణ కొనసాగుతుందని స్పష్టం చేసింది. లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 9ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ జీవోపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 13న అర్ధరాత్రి సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రక్రియ పూర్తిగా చట్టబద్ధంగా, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు తగ్గట్టుగా శాస్త్రీయంగా జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం తరుపున సీనియర్ లాయర్ అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. కులగణన సర్వేలో బీసీల జనాభా 57.6 శాతం ఉన్నట్లు తేలిందని, దాని ఆధారంగా 42% రిజర్వేషన్లు కల్పించాలని కమిషన్ సిఫార్సులు చేసిందని.. బీసీ కమిషన్ సిఫార్సుల మేరకే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించామని కోర్టుకు తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం.. తెలంగాణ ప్రభుత్వ వాదనలతో ఏకీభవించకుండా పిటిషన్ ను కొట్టివేసింది. హైకోర్టులో కేసు పెండింగ్ లో ఉన్నందున పిటిషన్ ను విచారణకు స్వీకరించలేమని.. అక్కడే తేల్చుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. పాత రిజర్వేషన్లపై ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది. హైకోర్టులో తదుపరి విచారణ కొనసాగుతుందని స్పష్టం చేసింది.

## దొమ్మాటి పరామర్శ..



అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డుకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ మడికొండ మొగిలి గుండెపోటుతో అకాల మరణం చెందారు. గురువారం ఉదయం ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య, పీఎస్ఎస్. మాజీ చైర్మన్ బొజ్జం రమేష్, టీపీసీసీ ఎస్సీ సెల్ కమిటీ వైస్-చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొచ్చు చందర్, సమన్వయ కమిటీ సభ్యులు చిన్నాల గోనాథ్, మడికొండ సంపత్ కుమార్, బీసీ సంఘం నాయకుడు అముదాలపల్లి మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది నివాళి..



అక్షర దర్బార్, నర్సంపేట: నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి రెండో అన్న పెద్ది సమ్మిరెడ్డి భార్య పెద్ది విమల బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, శుక్రవారం ఆమె పార్థివ దేహానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయనవెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి, మాజీ ఎంపీపీ ఉడుగుల ప్రవీణ్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు క్యాతం శ్రీనివాస్, తెలంగాణ విజయ్, మాజీ సర్పంచులు నానెబోయిన రాజారాం యాదవ్, ఊరటి అమరేందర్, తంగెళ్ల రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వైనాల వీరస్వామి, జన్ను జయరావు, గోనెల నరహరి, మేడిపల్లి రాజు, హరీష్, బూస సదయ్య, సుభాష్, మామిళ్ళ గోపి, గార్ల తదితరులు పాల్గొన్నారు.





# ఇసుక రవాణాలో పర్యవేక్షణ లోపం రావొద్దు

- ఎమ్మెల్యే జి.ఎస్.ఆర్
- 'ఇందిరమ్మ'కు ఇసుక సరఫరాపై సమీక్ష
- హాజరైన కలెక్టర్, ఎస్పీ

అక్షర దర్బార్, భూపాలపల్లి : ఇసుక రవాణాలో ఎలాంటి పర్యవేక్షణ లోపం జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరాపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రెవెన్యూ, పోలీస్, అటవీ, మైనింగ్, గృహనిర్మాణ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంబర్ ప్లేట్లు లేని వాహనాలను వెంటనే సీజ్ చేయాలని, అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలు నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రభుత్వం గుర్తించిన రీచ్‌ల నుండి మాత్రమే ఇసుక రవాణా జరగాలని స్పష్టం చేశారు. అలాగే లబ్ధిదారుల జాబితా, పూర్తి అయిన ప్రభుత్వ పనుల వివరాలు ఎంపీడీవోలకు అందజేయాలని, అనధికారికంగా రవాణా జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరిహద్దుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే రవాణాకు అనుమతి ఉంటుందని, ఒక వాహనానికి ఒక కూపన్ ఆధారంగా ఒక్క ట్రిప్ మాత్రమే అనుమతించాలని చెప్పారు. ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాల్లో రవాణా నిషేధమని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్ చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల స్థాయిలో అధికారులు జీపీవోలకు అవగాహన సమావేశాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణా నియంత్రణ బాధ్యత అన్ని శాఖలదేనని, పటిష్ట పర్యవేక్షణ వల్ల మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ట్రాక్టర్ల వివరాలు అందుబాటులో ఉండాలని, ప్రతిరోజు జారీ చేసే కూపన్ల నివేదిక అందించాలని సూచించారు. సమావేశంలో అటవీ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మైనింగ్ ఎడి జయరాజు, డిపిఓ శ్రీలత, భూపాలపల్లి నియోజకవర్గ మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడా పోటీలను ప్రారంభించిన జీఎస్సార్

భూపాలపల్లి సింగరేణి అంబేద్కర్ స్టేడియంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై జ్యోతి ప్రజ్వలన, జెండా ఆవిష్కరణ చేసి పోటీలకు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సహనాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, డీఎస్ఓ రఘు, గ్రంథాలయ చైర్మన్ కోటా రాజబాబు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

### బుగులోని జాతర ఏర్పాట్లపై సమీక్ష

అక్షర దర్బార్, భూపాలపల్లి : రేగొండ మండలం తిరుమలగిరి గ్రామ శివారులో నవంబర్ 4, 5, 6 తేదీలలో జరగనున్న బుగులోని శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర ఏర్పాట్లపై గురువారం భూపాలపల్లి కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. పోలీస్, ఆర్ డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, ఆర్ టీసీ, రెవెన్యూ, విద్యుత్, వైద్య, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై మాట్లాడుతూ.. "భక్తుల సౌకర్యార్థం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, జాతర సమయంలో ఎటువంటి అంతరాయాలు లేకుండా అన్నిఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## కష్టాల్లో ఉన్న మిత్రుడికి స్నేహితుల చేయూత

అక్షర దర్బార్, పరకాల: సుఖంలో పాలుపంచుకోవడమే కాదు, కష్టాల్లో అండగా నిలవడమే నిజమైన స్నేహమని ఆ మిత్ర బృందం నిరూపించింది. పితృవియోగంతో బాధలో ఉన్న తమ స్నేహితుడికి అండగా నిలిచి, ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకుంది. వివరాల్లోకి వెళితే, నడికూడ మండలం కౌకొండ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ చుక్క సతీష్ తండ్రి సల్మాన్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ విషాద సమయంలో సతీష్‌ను పరామర్శించిన 1996-97 సెవెంత్ ఫౌండేషన్ బ్యాచ్ స్నేహితులు, అతడి కుటుంబానికి తమ వంతు సాయంగా రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో తమతోటి మిత్రుడికి అండగా నిలవడం తమ బాధ్యత అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కెర రాజు, ముక్కెర చిరంజీవి, ఎండి సాధిక్ పాషా, మేకల సతీష్, పేర్వాల బాలకృష్ణ, మేకల రాజేందర్, బొల్లె ఓంకార్, పసుల నర్సింగం, ఎండి గిద్దు, జన్నారపు వేణు, మేకల కుమారస్వామి, మేకల ఓంకార్, జన్నారపు చంద్రమౌళి, సుమలత, శారద, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల స్తూపం ఆవిష్కరణ



అక్షర దర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అమరవీరుల స్తూపాన్ని జిల్లా పోలీస్ అధికారి కిరణ్ ఖరే గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ, ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులు సమాజానికి స్ఫూర్తిదాయకులు, వారి త్యాగాలను స్మరించుకుని సిబ్బంది ప్రజల రక్షణలో కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీనరేష్ కుమార్, భూపాలపల్లి డిఎస్పీ సంపత్ రావు, కాటారం డిఎస్పీ సూర్యనారాయణ, సిఐలు, ఎస్సైలు, డిపిఓలు , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పరకాలలో జోరుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

### త్వరగా గృహ ప్రవేశాలు జరగాలి : ఎంపీడీఓ ఆంజనేయులు



అక్షర దర్బార్, పరకాల: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరకాల మండలంలో శరవేగంగా కొనసాగుతోంది. శాసనసభ్యుల చొరవతో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని మండల అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు తెలిపారు. గురువారం ఆయన వెల్లంపల్లి గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పూర్తయిన ఇళ్లకు లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ అయ్యాయా లేదా అన్నది స్వయంగా తనిఖీ చేశారు. అవసరమైన నిర్మాణ సామాగ్రిలో ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. త్వరలో గరిష్ఠంగా గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. మండలంలోని 10 గ్రామాల్లో మంజూరైన 285 ఇళ్లలో ఇప్పటివరకు 169 ఇళ్లు వివిధ దశల్లో పూర్తయ్యాయని, వాటికి నిధులు జమ చేసినట్లు వివరించారు. మిగిలిన లబ్ధిదారులు కూడా పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.



## చిన్నారులను ఆశీర్వదించిన బీజేపీ నాయకులు

అక్షర దర్బార్, ఖానాపురం : నర్సంపేట నియోజకవర్గ బీజేపీ నాయకుడు ఆబోతు అరుణ– రాజు యాదవ్ దంపతుల పుత్రికలు సింధుశ్రీ, నేహశ్రీ నూతన వస్త్ర ఫలపుష్పాలంకరణ వేడుక ఖానాపురంలో జరగగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కంభంపాటి పుల్లారావు, జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్, కూనమల్ల పృథ్వీరాజ్, వనపర్తి మల్లయ్య, పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రామచందర్ రెడ్డి తదితరులు  పాల్గొన్నారు.



## బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని వెంటనే ఆమోదించాలి

### –బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నా

అక్షర దర్బార్, నల్లబెల్లి: బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని ఆమోదించాలని డిమాండ్ చేస్తూ బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నల్లబెల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమార స్వామి నేతృత్వం వహించారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చకపోవడం బీసీ వ్యతిరేక ధోరణి అని ఆయన విమర్శించారు. 18న జరగనున్న బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు మద్దతు తెలుపుతూ అందరూ ఉద్యమంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చీకటి ప్రకాష్, మేడిపల్లి రాజు, జక్కుల కార్తీక్, దిండు భరత్, ఎం.డి. సద్దాం తదితరులు పాల్గొన్నారు.




## హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ

అక్షర దర్బార్, నల్లబెల్లి: హెచ్ఐవీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని నల్లబెల్లి వైద్యాధికారి డాక్టర్ పి.బి. ఆచార్య, వైఆర్జి కేర్ లింక్ వర్కర్ స్కీమ్ డీఆర్పీ ఎం.డీ. ముస్తాక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో నిర్వహించిన హెచ్ఐవీ అవగాహన ర్యాలీని డాక్టర్ పీబీ ఆచార్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్ఐవీ వ్యాధి కేవలం నాలుగు మార్గాల ద్వారా వ్యాపిస్తుందని వివరించారు: అసురక్షిత లైంగిక సంబంధాలు, కలుషిత రక్త మార్పిడి, కలుషిత సూదులు/సిరంజీలు వినియోగించడం, హెచ్ఐవీ ఉన్న తల్లిదండ్రుల నుంచి పుట్టే శిశువులకు వ్యాధి సోకుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఆర్జికేర్ లింక్ వర్కర్ స్కీమ్ ప్రతినిధులు సామల వీరన్న, జరుపుల లింగన్న,  అంగన్వాడీలు పాల్గొన్నారు.

## బీసీ జేఏసీ బంద్ ను విజయవంతం చేయండి



అక్షర దర్బార్, నూగూరు,(వెంకటాపురం) : బీసీ రిజర్వేషన్ల అమలు కోసం బీసీ జేఏసీ ఇచ్చిన తెలంగాణ బంద్ ను విజయవంతం చేయాలని జేఏసీ జిల్లా అధ్యక్షుడు ముంజల భిక్షపతి గౌడ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా ఉపాధ్యక్షులు మంచర్ల నాగేశ్వరావు పిలుపునిచ్చారు. ములుగు జిల్లా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో సమావేశం నిర్వహించారు. సభలో స్థానిక ఎన్నికలలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు కావాలని, అన్ని బీసీ సంఘాలు, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. బీసీలకు రాజకీయాలు కాదని, కేవలం జనాధికారాలు కోసం ముక్తకంఠంతో పోరాటం చేయాలన్నారు. ఈనెల 18వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జరిగే బీసీ జేఏసీ బందును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోనుగోటి రవి, గోల్కొండ రాజు, తోటకూరి శ్రీకాంత్ గౌడ్, బట్ట నాగేందర్, జింక వేణు, బక్కి నవీన్, మహమ్మద్ బాబుల్, కుక్కల సంపత్, నారోజు అఖిల్, మహమ్మద్ ఖలీల్, భాస్కర్ గౌడ్, చింత నిప్పుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# పేకాట 'కేటు'గాళ్లు

- ఆదాయం కోసం కొత్త పుంతలు
- మహదేవపూర్,కాటారం మండలాల్లో ఆగని హోల్మీ పేకాట
- పేకాట ఆడిస్తూ డబ్బులు సంపాదిస్తున్న వైనం
- సకల సౌకర్యాలతో ఆడిస్తున్న కేటు గాళ్ళు
- కానరాని నిఘా యంత్రాంగం

అక్షర దర్బార్, కాటారం : జీవితాలని ఛిద్రం చేస్తూ,బతుకులని చీకటి చేసే పేకాట ప్రస్తుతం రూపు మార్చుకుంది.'శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయలన్నట్లుగా ' ఈ మార్పు పేకాట రాయుళ్లకు అవకాశంగా మారింది.ఇంకేముంది పచ్చని జీవితాలని చేజేతుల నాశనం చేసుకుంటూ దుర్భరమైన జీవితాలను గడిపే దుస్థితి తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్, కాటారం మండలాల్లో పేకాట జూదం కొత్త రూటు మార్చుకుందనే ప్రచారం జోరుగా జరుగుతుంది.గతంలో ఈ ప్రాంతంలో పేకాట ఆడాలంటే దట్టమైన అటవీ,గ్రామ శివారు ప్రాంతాలను మాత్రమే ఎంచుకునే పేకాట రాయుళ్లు ఇప్పుడు సాంప్రదాయ ఇండ్లకి మకాం మార్చి జేబులు గుల్ల చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది.అయితే అవి పేరుకు మాత్రం పచ్చని కుటుంబాలు జీవించే సాంప్రదాయ ఇండ్లలా దర్శనమిస్తున్నా లోలోపల మాత్రం క్లబ్బులను తలపించేలా జోరుగా పేకాట నడుస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.దీని కోసం కొందరు వ్యక్తులు 'కేటు'గాళ్ళ అవతారమెత్తి ఎంచక్కా పేకాట ఆడిస్తున్న తీరు మాత్రం అమోఘమనే చెప్పుకోవచ్చు.ఆ ఇంట్లోనే పేకాట రాయుళ్లకు మందు,విందు లాంటి సకల సౌకర్యాలు కల్పించి కేటు తీసుకుంటారనేది బహిరంగ రహస్యమే నట.

### మాజీ ప్రజాప్రతినిధి ఇంట్లోనే పేకాట

మహదేవపూర్ మండల కేంద్రంలో నివాసముండే ఉమ్మడి మహదేవపూర్ మండలానికి చెందిన ఓ మాజీ ప్రజా ప్రతినిధి ఇంట్లోనే జోరుగా పేకాట ఆడుతున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. ఆ ప్రజా ప్రతినిధి భర్తనే కేటు గాడిగా అవతారమెత్తి పేకాట ఆడిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది.అడ్డుగా వచ్చే ఎంతటి అధికార వ్యవస్థనైనా మ్యానేజ్ చేసే శక్తి సామర్థ్యం తనకుందని నా ఇంట్లో ఆడితేనే మీకు సురక్షితమని పేకాట రాయ్యుళ్ళని ఆకర్షిస్తున్నట్లుగా గుసగుసలాడుతున్నారు. ఈ క్రమంలోనే అతగాడి ఇంట్లోనే పేకాటను సజావుగా నిర్వహిస్తూ ఓపెన్ గానే కేటు తీసుకుంటున్నట్లుగా ఇన్ఫర్మేషన్. కాగా ఇతగాడి అడుగుజాడల్లోనే అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు సైతం కేటు ఆడించి డబ్బులు సులువుగా సంపాదించొచ్చనే ఆలోచనలో ఉన్నట్లుగా ప్రచారం జరుగుతుంది.ఈ క్రమంలోనే తాను పార్టీలో కొన్నాళ్లుగా కష్ట పడుతున్నానని పేకాట క్లబ్ తరహా నిర్వహించుకునేందుకు తనకు పరోక్ష అనుమతులు ఇప్పించాలని బొమ్మాపూర్ గ్రామానికి చెందిన మరో చోటా లీడర్ ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లుగా సమాచారం.ఇలా అధికారాన్ని ఆసరాగా తీసుకుని కొందరు వ్యక్తులు ఈజీ మనీ కోసం పాకులాడుతున్న తీరు మహాదేవపూర్ మండలంలో హాట్ టాపిక్ గా మారింది.

### అడ్డాలు మారుస్తూ ఆడేస్తున్నారు

పేకాటని వ్యసనంగా మార్చుకున్న కొందరు పేకాట రాయుళ్ళు గతంలో పట్టుబడిన వారిలో ఎలాంటి మార్పు రావడం లేదనే చర్చ సాగుతోంది. ఇటీవల కాటారం మండలం దేవరాంపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న పేకాట రాయుళ్ళని పట్టుకుని అలా కేసులు పెట్టారో లేదో వారం తిరగక ముందే మరో అడ్డా చేంజ్ చేసుకుని దర్జాగా ఆడేస్తున్నట్లుగా సమాచారం. గారెపల్లి కేంద్రంలోని ఎంఆర్ఎఫ్ టైర్ షోరూం పరిసర ప్రాంతంలో ఓ వ్యక్తి పేకాట క్లబ్ తరహా తన గదిలో ఆడిస్తున్నట్లుగా టాక్ నడుస్తోంది. అంతే కాకుండా గంగారం ఎక్స్ రోడ్డుతో పాటు కొండంపేట తదితర గ్రామాల్లో హోల్మీ పేకాట నడుస్తున్నట్లుగా చర్చ జరుగుతుంది. కాగా అడ్డుకోవాల్సిన నిఘా విభాగం కాస్తా సదరు పేకాట రాయుళ్లతో మిలాఖతై వారితో పార్టీలు చేసుకుంటున్నట్లుగా బహిరంగ వాదనలు విని పిస్తున్నాయి.ఏది ఏమైనా కుటుంబాలని నాశనం చేసే పేకాటనే మహమ్మారిని నిర్వీర్యం చేసి కుటుంబాలను పరిరక్షించేలా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ప్రాణం తీసిన పదివేల అప్పు

- అన్న, వదినపై కత్తితో దాడి చేసిన తమ్ముడు
- అక్కడికక్కడే మృతి చెందిన స్వరూప, రమేష్ పరిస్థితి విషమం
- కొండాపురం గ్రామంలో విషాద ఘటన

అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి మండలం కొండాపురం గ్రామంలో అవసరం కోసం తీసుకున్న రూ.పదివేల  అప్పు ప్రాణాలమీదికి తీసుకువచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రమేష్, సురేష్ అన్నదమ్ములు. నాలుగు నెలల క్రితం సురేష్ తన అన్న రమేష్‌కు రూ.10 అప్పు ఇచ్చాడు. ఈ క్రమంలో తీసుకున్న అప్పు తిరిగి చెల్లించకపోవడంతో సురేష్, రమేష్ మధ్య తరచుగా గొడవలు జరిగాయి. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం డబ్బుల విషయంలో జరిగిన వాగ్వాదంలో క్షణికావేశంలో సురేష్ చేతిలో ఉన్న కత్తితో రమేష్‌పై దాడి చేశాడు. గమనించిన రమేష్ భార్య స్వరూప మధ్యలో వచ్చి అడ్డుకోవడంతో ఆమెపై కూడా కత్తితో దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అయితే స్వరూప మార్గమధ్యలో మృతి చెందగా, రమేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అవసరానికి తీసుకున్న కేవలం రూ.10వేల రూపాయల అప్పు తిరిగి తీర్చకపోవడంతో ఘర్షణ చోటు చేసుకుని ప్రాణాలమీదికి తెచ్చుకున్న ఘటనపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

## నడికూడ నూతన ఎంపీడీఓగా రామకృష్ణ



అక్షర దర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా నడికూడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా గురువారం రామ రామకృష్ణ పదవి బాధ్యతలు చేపట్టారు.

# తాణాను సందర్శించిన సీపీ సన్ ప్రీత్ సింగ్



అక్షరదర్బార్, హసన్ పర్తి: వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం హసన్ పర్తి పోలీస్ స్టేషన్ ను తొలిసారిగా సందర్శించారు. ఈ సందర్భంగా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, హసన్ పర్తి ఇన్ స్పెక్టర్ చేరాలు పోలీస్ కమిషనర్ కు పుష్పాగుచ్చాలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి స్టేషన్ పరిధిలోని గ్రామాలు, ఎలాంటి ఫిర్యాదులు అధికంగా నమోదవుతాయి, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, రౌడీ షీటర్లు, అనుమానిత వ్యక్తుల వివరాలతో పాటు స్టేషన్ అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై సీపీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. హన్మకొండ – కరీంనగర్ ప్రధాన రోడ్డు మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై సీపీ ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ బాధితులకు పారదర్శకంగా న్యాయం అందించాలని, నీతి, నిజాయితీగా విధులు నిర్వహిస్తూ ప్రజలు అభిమానాన్ని పొందాలని సూచించారు.

## మద్యం దుకాణాల లైసెన్సులకు
# పకడ్బందీ ఏర్పాట్లు

### జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఆర్. ప్రవీణ్ కుమార్

అక్షర దర్బార్, మహబూబాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐఎంఎల్ పాలసీ 2025–27 ద్వారా మద్యం దుకాణాల లైసెన్సుల అమలుకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు (ఇన్‌చార్జి) జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి ఆర్. ప్రవీణ్ కుమార్ తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఎల్లుండి (అక్టోబర్ 18) తో గడువు ముగుస్తున్నందున, దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. గురువారం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్లు చిరంజీవి, భిక్షపతి, అశోక్‌లతో కలిసి ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలోని 61 మద్యం దుకాణాల కోసం సెప్టెంబర్ 26 నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇప్పటివరకు 243 దరఖాస్తులు వచ్చాయని, గడువు ముగియడానికి చివరి రెండు రోజులు మాత్రమే ఉన్నందున పెద్ద మొత్తంలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.



# 170 మంది మావోయిస్టులు లొంగుబాటు

- లొంగిపోయే మావోయిస్టులను స్వాగతిస్తున్నాం..
- జనజీవన స్రవంతిలోకి రాకపోతే పర్యావసనాలు ఎదుర్కొంటారు..
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా
- వచ్చే ఏడాది మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలిస్తామని పునరుద్ఘాటన



అక్షరదర్బార్, న్యూఢిల్లీ: మావోయిస్టు పార్టీ వరుసగా భారీ ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మావోయిస్టు పార్టీకి దశాబ్దాలపాటు అత్యంత కీలక నేతగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్ తాజాగా మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ముందు లొంగిపోయిన మరుసటి రోజే మరో 170 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయారు. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం వెల్లడించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం 27మంది, మహారాష్ట్రలో గురువారం 61 మంది జనజీవన స్రవంతిలోకి వచ్చారన్నారు. దీంతో రెండు రోజుల వ్యవధిలో 258 మంది లొంగిపోయారని తెలిపారు. నక్సలిజంపై పోరులో ఇదో పెద్ద విజయమని అభివర్ణించారు. భారత రాజ్యాంగంపై తమ విశ్వాసాన్ని ప్రకటిస్తూ హింసను త్యజించాలనే వీరి నిర్ణయాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల ఫలితాలను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. లొంగిపోయే మావోయిస్టులను స్వాగతిస్తామని.. ఇంకా తుపాకీతో ఉద్యమం కొనసాగించాలనుకొనేవారు భద్రతా దళాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. మావోయిస్టు మార్గంలో ఇంకా కొనసాగుతున్న వారు ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో చేరాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని సమూలంగా నిర్మూలించేందుకు తాము కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాద స్థావరాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్, ఉత్తర బస్తర్‌లు విముక్తిపొందిన ప్రాంతాలుగా ప్రకటించడం సంతోషదాయకమని తెలిపారు. ఇప్పుడు దక్షిణ బస్తర్‌లో నక్సలిజం జాడ ఉందని.. దీన్ని భద్రతా దళాలు త్వరలో తుడిచిపెడతాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ సర్కార్ ఏర్పడిన తర్వాత జనవరి 2024 నుంచి 2,100 మంది మావోయిస్టులు లొంగిపోగా, 1785 మందిని అరెస్టు చేశారని తెలిపారు. 477 మందిని భద్రతాదళాలు నిర్మూలించాయని స్పషం చేశారు.

## మావోయిస్టు పార్టీ అగ్రనేత
# ఆశన్న లొంగుబాటు

- ఆయన అసలు పేరు తక్కెళ్‌షపల్లి వాసుదేవరావు
- స్వస్థలం ములుగు జిల్లాలోని నర్సింగాపూర్
- చంద్రబాబు అలిపిరి బ్లాస్ట్ వెనుక ఈయన మాస్టర్ బ్రెయిన్



అక్షరదర్బార్, హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్‌లో తాజాగా లొంగిపోయిన మవోయిస్టుల్లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్నకూడా ఉన్నారు. ఆయన స్వస్థలం ప్రస్తుత ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని నర్సింగాపూర్. ఆ గ్రామంలోని తక్కళ్లపల్లి భిక్షపతిరావు, సరోజన దంపతులకు ఇద్దరు సంతానం కాగా పెద్ద కుమారుడు వాసుదేవరావు (ఆశన్న). చిన్న కుమారుడు సహదేవరావు. ఆశన్న ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. అనంతరం కాజీపేట ఫాతిమా స్కూల్‌లో సెకండరీ విద్యను అభ్యసించాడు. అ తర్వాత చిన్నతనంలోనే మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడై 1990లో అడవి బాట పట్టాడు. ఆశన్నపై 38 సంవత్సరాల క్రితం వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్‌లో తొలి కేసు నమోదైంది. ఆయన మొదట కాకతీయ యూనివర్సిటీలో సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ అనుబంధ రాడికల్ స్టూడెంట్ యూనియన్‌కు నాయకత్వం వహించారు. కాగా ఆ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిన ఆయన ఐపీఎస్ ఉమేష్‌చంద్ర, మాజీ హోంమంత్రి మాధవరెడ్డి హత్యలో కూడా ఆశన్న పాత్ర ఉందని చెబుతారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పటి సీఎం చంద్రబాబునాయుడిపై 2003 అక్టోబరు 1న అలిపిరిలో జరిగిన దాడిలో కూడా ఆశన్నదే కీలకపాత్ర. మావోయిస్టు పార్టీలో రాజకీయ వ్యూహాలు, సైనిక కార్యకలాపాల్లో ప్రచార విషయాల్లో ఆశన్ననే కీలకంగా వ్యవహరిస్తారు. 2024 నవంబరులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆశన్న మరణించినట్టు వదంతులు వ్యాపించాయి. కానీ, ఆ తర్వాత ఆయన బతికే ఉన్నాడని తేలింది. ప్రస్తుతం ఆశన్న వయసు 60 సంవత్సరాలు పైబడి ఉంటుంది.

# ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి

- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్
- కొనుగోళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు




అక్షర దర్బార్, మహబూబాబాద్ : వానాకాలం 2025–26 సీజన్‌కు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సిద్ధంగా ఉండాలని, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ హెచ్చరించారు. జిల్లాలో మొత్తం 242 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో సహకార శాఖ ఆధ్వర్యంలో 168, ఐకేపీ 59, గిరిజన కార్పొరేషన్ 13, మెప్మా 2 కేంద్రాలు ఉంటాయని తెలిపారు. గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, డీఆర్‌డీఓ పీడీ మధుసూదనరాజు, సహకార శాఖాధికారి వెంకటేశ్వర్లు, డీఏఓ విజయనిర్మల, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ, సహకార, ఐకేపీ, పౌరసరఫరాలు, తహసీల్దారులు, ఏపీవోలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

### రైతులకు మౌలిక వసతులు కల్పించాలి

కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని మౌలిక వసతులను కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న హార్వెస్టింగ్ వివరాలను ముందస్తుగా తెలుసుకొని, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ మార్పులపై ప్రతి విషయాన్ని రైతులకు తెలియజేయాలని సూచించారు. ఎఫ్‌ఏక్యూ (FAQ) నిబంధనల ప్రకారం 17 శాతం తేమ వచ్చిన తర్వాతనే ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

### కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, రైతుల నుండి వచ్చే ఎలాంటి సమస్యలనైనా తక్షణమే పరిష్కరించేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కడా కూడా ఇబ్బందులు లేకుండా రవాణా చేయు విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

### సిబ్బందికి శిక్షణ తప్పనిసరి

కొనుగోళ్ల నిర్వహణపై అన్ని విభాగాల సిబ్బందికి తప్పనిసరిగా శిక్షణ తరగతులను నిర్వహించాలని, ఏ ఒక్క చిన్న పొరపాటు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహించాలని, ఏ విధమైన ఆరోపణలు వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సూచనలు, నిబంధనల ప్రకారం పక్కా ప్రణాళికతో బాధ్యతాయుతంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిర్వహించాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.